క్లుప్తంగా

ప్రశంసపత్రం అందజేత



గూడూరు: ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలని, అలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి అవార్డులు ఇస్తుందని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. అంబేడ్కర్ 132వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం సేవా దృక్పథం కల్గిన వారికి దళిత రత్న అవార్డులను ప్రదానం చేసింది. వారిలో గూడూరు మండల కేంద్రానికి చెందిన బోడ ఎల్లయ్య ఎంపిక అయ్యాడు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్లయ్యకు దళితరత్న అవార్డు ప్రశంస పత్రాన్ని అందించారు.

పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భద్రయ్య



గార్ల: పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గార్ల మండలం మద్దివంచ గ్రామానికి చెందిన గౌని భద్రయ్యను ఆదివారం మహబూబాబాద్‌లో జరిగిన పీవైఎల్ జిల్లా ప్రథమ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గార్లకు చెందిన ఇర్రి రవిని జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థిని ఎంపిక



కురవి: సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సీహెచ్ శ్రీహర్షిని ఈ విద్యాసంవత్సరం మేధా చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీహర్షిని ఇంటర్మీడియట్‌తోపాటు బీటెక్ వరకు ఆరు సంవత్సరాలు ఉచిత స్కాలర్‌షిప్ ద్వారా కార్పొరేట్ కాలేజీలో సీటు లభిస్తుందని ఆయన వివరించారు.

పెంటకుప్పల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బొట్యతండా గ్రామ పంచాయతీలోని పరిధిలోని ప్రధాన రహదారుల్లో పేరుకపోయిన పెంటకుప్పలను జీపీ ఆధ్వర్యంలో ఆదివారం డోజర్ ద్వారా తొలగించారు. 'ఊరంతా పెంటకుప్పలు.. మురుగునీరు..'అనే శీర్షిక ఇటీవల సాక్షిలో ప్రచురితమైన విషయం విధితమే. గ్రామంలో పరిశుభ్రత పనులు చేపట్టి గిరిజన ప్రజల ఇబ్బందులను తొలగించేల చర్యలు చేపట్టారు.

అస్తవ్యస్తంగా డ్రైయినేజీ



మరిపెడ రూరల్: మండలంలోని ఎడ్జెర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పూసల తండాలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. తండాలోని మురుగు నీటి కాల్వలో పేరుకపోయిన చెత్తాచెదారం తొలగించకపోవడంతో సరఫరా లేక మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. గ్రామ సర్పంచ్, కార్యదర్శికి చెప్పిన వారు పట్టించుకోవడం లేదని గిరిజన ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో మురుగు నీటిపై దోమలు స్వైరవిహారం చేస్తు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని తండావాసులు చెబుతున్నారు. దోమల కారణంగా పలువురు జ్వరం బారిన పడినట్లు వెల్లడించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మురుగు నీటి కాల్వలు శుభ్రం చేసేల చర్యలు తీసుకోవాలని తండా ప్రజలు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మహబూబాబాద్ రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. గుర్తు తెలియని ఓ వ్యక్తి కొద్ది రోజుల నుంచి జిల్లా కేంద్రంలోని గ్యాస్ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన ఉంటున్నాడు. ఒక్కసారిగా ఆదివారం అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకొని ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా అతడు మృతిచెందాడు. గుర్తు తెలియని వ్యక్తి మృతి సమాచారాన్ని ఆస్పత్రి పేషెంట్ కేర్ అశోక్ పోలీసులకు తెలియజేశాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం గదిలో భద్రపరిచారు. ఎవరైనా అతడిని గుర్తుపడితే మహబూబాబాద్ టౌన్ పోలీసుల 87126 56930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు పేర్కొన్నారు.

జిల్లాలో జీఎస్టీ దందా

- జీరో బిల్లులతో వ్యాపారం
- కొనుగోలుదారులకు ఇవ్వని బిల్లులు
- మిగిలిన ఇన్‌పుట్స్ బిల్లులకు పర్సంటేజీ ప్రకారం విక్రయాలు
- ఈ వ్యవహారంలో సీఏల పాత్ర కీలకం
- దందాను అరికట్టడంలో అధికారుల విఫలం

మహబూబాబాద్: జిల్లాలో కొంత మంది వ్యాపారులు జీరో బిల్లులతో వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారులు కొనుగోలుదారులకు జీఎస్టీ బిల్లులు ఇవ్వకుండా ఇతరులకు పర్సంటేజీ ప్రకారం విక్రయిస్తున్నారు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యాపారం చేస్తూ అందినంత దండుకుంటున్నారు. దందాను అరికట్టడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పరిస్థితిని బట్టి అవసరమైతేనే సీఏలతో వెంటనే బిల్లులు చేసి పంపిస్తున్నారు. జిల్లాలలో సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో సెంట్రల్ జీఎస్టీ మానుకోట రేంజ్ కార్యాలయం ఉంది. దానిలో సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, కాంటిన్‌జెంట్ (ఆఫీస్‌బాయ్) పని చేస్తున్నారు. వాణిజ్య పన్నుల కార్యాలయం (స్టేట్ జీఎస్టీ కార్యాలయం)లో సీటీఓ, ఇద్దరు ఏసీటీఓ, ఆరుగురు సీనియర్ అసిస్టెంట్‌లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్‌లు, అటెండర్ పని చేస్తున్నారు. సెంట్రల్, స్టేట్ జీఎస్టీ లైసెన్స్‌లు జిల్లాలో 1792 ఉన్నట్లు అధికారులు తెలిపారు. వ్యాపారం చేసే వారికి సంవత్సరానికి లావాదేవీలు రూ.20లక్షలకు పైగా ఉన్న వారు తప్పనిసరిగా జీఎస్టీ లైసెన్స్ తీసుకోవాలి. కొన్ని వ్యాపారాలకు జీఎస్టీ లైసెన్స్ తప్పనిసరిగా వారి సంవత్సరానికి ఇరవై లక్షల ఆర్థిక లావాదేవీలు లేకున్నా తీసుకోవాల్సి వస్తుంది. కొన్ని పనులకు కాంట్రాక్టర్లు జీఎస్టీ తీసుకోవాలి. లేకుండా టెండర్‌లలో పాల్గొనే అవకాశం ఉండదు. వారు లైసెన్స్ తీసుకున్నా వారికి లావాదేవీలతో పని ఉండదు.

ఆన్‌లైన్‌లోనే అన్ని..

ఆధార్ కార్డు, పాన్‌కార్డు వ్యాపార పత్రాలు, షాపుకి రాయి లేక సొంత భవనం ఇతరత్రా వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అన్నిలావాదేవీల బిల్లులు ఇతరత్రా అన్ని ఆన్‌లైన్‌లో జరగాలి. వ్యాపారులలో చాలా మందికి జీఎస్టీ మీద పూర్తిగా అవగాహన లేక ప్రతి వ్యాపారి చార్టెడ్ అకౌంటెంట్‌తో (సీఏ) పనులు చేయిస్తున్నారు. వారి వ్యాపార బిల్లులు ఇతరత్రా అన్ని సరి చేసేది సీఏలే. చాలా మంది వ్యాపారులు ప్రధానంగా సిమెంట్, ఐరన్, పెయింట్స్ ఇతరత్రా వ్యాపారాలు చేసే వారు జీరో బిల్లులలో వ్యాపారం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. జీఎస్టీ బిల్లులు చాలా మంది ఇవ్వకపోవడంతో ఆ జీఎస్టీ బిల్లులు మిగిలి ఉండటంతో(ఇన్‌పుట్స్) వాటిని పర్సంటేజీ ప్రకారం విక్రయిస్తున్నారు. జీఎస్టీ విషయంలో ప్రతి షాపు వ్యాపారి సీఏతో బిల్లులు చేయించి నెలకు వేతనంతోపాటు సంవత్సరం జీఎస్టీలో పర్సంటేజీ ఇస్తున్నారు. తూతూ మంత్రంగా సంబంధిత అధికారులు తనిఖీలు చేస్తున్నారు. దీంతో వ్యాపారులు జీఎస్టీ విషయంలో దందాలకు పాల్పడుతున్నారు.



జిల్లా కేంద్రంలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయం

ఫిర్యాదు చేస్తే తనిఖీ చేస్తాం

జీఎస్టీ విషయంలో ఎవరైనా కొనుగోలుదారులు ఫిర్యాధు చేస్తే ఆ షాపు తనిఖీ చేసి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. హైదారాబాద్ హెడ్ ఆఫీస్ నుంచి సమాచారం వచ్చినప్పుడలా తనిఖీలు చేస్తున్నాం. ఇన్‌పుట్స్ బిల్లులు పర్సంటేజీ ప్రకారం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జీఎస్టీ బిల్లులు అమ్మడం చట్టవిరుద్ధం.

- సతీష్‌కుమార్, సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్

చేనేతన్నల సంక్షేమానికి కేసీఆర్ కృషి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. డివిజన్ కేంద్రంలోని లయన్స్‌క్లబ్ భవనంలో ఆదివారం పద్మశాలీ సంఘం మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. మండల అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కస్తూరి పులేందర్, కోశాధికారి లక్ష్మీ నారాయణ, ఇతర కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడుతూ.. నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నా యకులు మల్లేషం,మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న, నాయకులు రమేష్, శ్రీనివాస్, ఈశ్వర్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వం



తొర్రూరులో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

తొర్రూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని ప్రజాపంథా ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి తెలిపారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 12 వరకు మండల, డివిజన్ కేంద్రాల్లో దీక్షా దివస్ పేరిట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, నాయకులు యాకయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ: ఎన్నో ఉద్యమాలు, ఎందరో ప్రాణత్యాగాలతో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని, అందుకు నిరసనగా జూన్ 2నుంచి పదిరోజుల పాటు చేపట్టనున్న దీక్ష దివస్‌ను జయప్రదం చేయాలని ప్రజాపంథా పార్టీ జిల్లా నాయకుడు పూనెం ప్రభాకర్ ఆదివారం కోరారు. సమావేశంలో నాయకులు పాపయ్య, రంగయ్య, చిత్తారి పాపయ్య, రాములు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న పూర్ణచందర్‌రెడ్డి

కురవి: డోర్నకల్ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ డోర్నకల్ నియోజకవర్గ కన్వీనర్ తాడ పూర్ణచందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలోని పోలింగ్ బూత్ స్థాయిలో మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొణతం పెంటయ్య, నర్సింగం అశోక్, బుడిగభద్ర సేనాగౌడ్, కోలా వరదరాజులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో కార్డన్‌సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

కొత్తగూడ: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ఆదివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఉదయాన్నే భారీ సంఖ్యలో చేరుకున్న పోలీసులు తనిఖీలు చేశారు. గుడుంబా తయారీకి వినియోగించే వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఎలాంటి డాక్యుమెంట్ లేని 14ద్విచక్ర వాహనాలు, 25లీటర్ల గుడుంబాను సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులతో సీఐ యాసిన్ మాట్లాడారు. చట్ట వ్యతిరేకమైన పనులు చేయొద్దని కౌన్సెలింగ్ నిర్వహించారు. గుడుంబా తయారు చేయడం నేరంగా భావించి గుడుంబా రహిత గ్రామంగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు నగేష్, ఉపేందర్, దిలీప్ పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



ర్యాలీ నిర్వహించిన పీవైఎల్ నాయకులు

గూడూరు: అమరవీరుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలకంటి రాజేందర్, ఎన్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని ఐలన్న, చుంచు శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జోగ రణధీర్ అధ్యక్షతన ప్రథమ జిల్లా మహాసభను నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా పీవైఎల్ జెండా ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, దేవేందర్, వెంకన్న, లింగన్న, అచ్చన్న, మురళీకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం పట్టించుకోని ప్రభుత్వం

దంతాలపల్లి: రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చోద్యం చూస్తుందని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రంగు రాముగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం కావస్తున్నా ఇప్పటి వరకు కల్లాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు చేయలేదని గుర్తుచేశారు. స్థానిక ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికలు ప్రజలు బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ పూర్ణచందర్, మండల ప్రధాన కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు



గార్ల: నివాళులర్పిస్తున్న నాయకులు



డోర్నకల్‌లో..



కేసముద్రంవిలేజ్‌లో..

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్లమెంట్‌నియోజకవర్గ అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. తెలుగు జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్: ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు బండి పుల్లయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వర్గీయ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరంలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు ఉత్సవాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా తెలుగు దేశం పార్టీ నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఎండి ఇమాం, పార్లమెంట్ నాయకులు ప్రేమ్‌చంద్ వ్యాస్, రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తొర్రూరు రూరల్: చెర్లపాలెంలో..



కేసముద్రం: 2001-02 బ్యాచ్ విద్యార్థులు..



డోర్నకల్ దయోసిసన్ ఉన్నత పాఠశాలలో..



కేసముద్రం:1991-92 బ్యాచ్ విద్యార్థులు..



కేసముద్రం: 1982-83 బ్యాచ్ విద్యార్థులు..

తొర్రూరు రూరల్: మండలంలోని చెర్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో 2002-03 పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహంకాళి బుచ్చయ్య, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డోర్నకల్: డోర్నకల్ దయోసిసన్ ఉన్నత పాఠశాలలో 2001-2002 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని లక్ష్మీసాయిగార్డెన్‌లో కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్‌ఎస్‌కి చెందిన 1982-83 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పూర్వ విద్యార్థి సుమలతకు రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. గణపతి ఫంక్షన్ హాల్‌లో కేసముద్రంస్టేషన్‌కి చెందిన 1991-92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు, రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కేసముద్రంవిలేజ్ జెడ్పీఎస్‌ఎస్‌కి చెందిన 2001-02 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మెల్యేకు ఆహ్వానం



చిన్నగూడూరు: మరిపెడ మండలం తానంచర్ల గ్రామంలో జూన్ 7 నుంచి ప్రారంభమయ్యే కంత మహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని తానంచర్ల దేవగౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్న, గంధసిరి వెంకన్న, లింగయ్య, నర్సయ్య, బిక్షం ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



గార్ల: మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి గార్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, లాయర్ జంపాల విశ్వ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఈమేరకు లేఖను ఆదివారం గార్లలో విలేకరులకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంకు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సు లేకపోవడంతో మండల ప్రజలు ఆటోల ద్వారా వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

విగ్రహం ఏర్పాటు చేయాలి

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో తొలగించిన గిరిజన విప్లవ పోరాట యోధుడు కొమురంభీం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అదివారం అన్నారు. ఈ సందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. 5 సంవత్సరాల క్రితం రోడ్డు వెడల్పులో తొలగించిన విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకుండా విగ్రహాన్ని అవమానిస్తున్నారని అన్నారు.

చెక్కుల పంపిణీ

చిన్నగూడూరు: పేదల పాలిట పెన్నిధిలా సీఎం సహాయనిధి నిలుస్తుందని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉగ్గంపల్లిలో వివిధ మండలాలకు చెందిన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే రెడ్యానాయక్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నాయకులు ఆయూబ్‌పాషా, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారుల్ని భాగస్వామ్యం చేయాలి

కేసముద్రం: జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో, మలిదశ ఉద్యమకారుల్ని భాగస్వామ్యం చేయాలని ఉద్యమకారుడు చాగంటి కిషన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కన్వీనర్ కొలిపాక వెంకన్న, కోకన్వీనర్‌లు అనసూర్య, చుంచు సూరయ్య, పరమేశ్వర్, మలేంద్రం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి సోదరుడు మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి అకాల మృతిపట్ల జిల్లా కాంగ్రెస్ నేతలు సంతాపం తెలిపారు. హనుమకొండలో ఆయన మృతదేహాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ భూక్య మురళీనాయక్ నివాళులర్పించారు.

నేడు స్థూపం ఆవిష్కరణ

చిన్నగూడూరు: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు మండల జేఏసీ కన్వీనర్ గాడిపెల్లి అనిల్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జేఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపారు.

పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలి

బయ్యారం: పోడుసాగు చేస్తున్న రైతులందరికి పట్టాలు ఇవ్వాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మురళి, వెంకటనర్సు, భిక్షం, వెంకన్న పాల్గొన్నారు.

చెట్టును తొలగించిన పోలీసులు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కొంత సమయంపాటు కురిసింది. దీంతో కుమ్మరికుంట తండా, పర్వతగిరి ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగి పడటంతో వచ్చిపోయే ప్రయాణికులకు అంతరాయం ఏర్పడింది. వెంటనే సమాచారం తెలుసుకున్న మహబూబాబాద్ రూరల్ ఎస్సై రాంచరణ్, పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడిఉన్న చెట్టును తొలగించి సమస్యను పరిష్కరించారు.

గుండెపోటుతో పూజారి మృతి

మరిపెడ: మరిపెడకు చెందిన పూజారి పాకాల రమణశర్మ(70) గుండెపోటుతో శనివారం రాత్రి మృతిచెందాడు. పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూరరవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో దుక్కిటెద్దు మృతి

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామ శివారు జయ్యారం తండాలో గుగులోతు బాలుకు చెందిన దుక్కిటెద్దు ఆదివారం మేతకోసం పొలాల్లోకి వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న తీగలను తాకిన వెంటనే మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



నెహ్రూసెంటర్: ప్రభుత్వం స్పందించి వీఓఏలకు కనీస వేతనం అమలు చేసి రెగ్యులర్ చేయాలని వీఓఏలు కోరారు. ఈ సమ్మెలో వీఓఏలు కృష్ణవేణి, అరుణ, అనిత, శోభ, రమేష్, రోజ పాల్గొన్నారు.

గూడూరు: ప్రభుత్వం వెంటనే వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సంఘం అధ్యక్షురాలు శ్రీలత కోరారు. మండల కేంద్రంలో సమస్యల పరిష్కారానికి వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 42వ రోజుకు చేరింది. సందర్భంగా హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు బయలుదేరారు. కార్యక్రమంలో యాకన్న, మల్లేష్, రాములు, భారతి, శారద, సుధాకర్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.